# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 29 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## సిఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈనెల 30వ తేదిన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, వివిధ శాఖల అధికారులతో సోమవారం ఉదయం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సిఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని అలాగే సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు హెలిప్యాడ్, పబ్లిక్ మీటింగ్ స్థలంలో బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు పకబ్బందీగా చేయాలని స్పష్టం చేశారు. ఈఈ ఆర్ అండ్ బి హెలిప్యాడ్ సభ స్థలం వద్ద స్టేజ్, పార్కింగ్ ఏర్పాట్లు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కెవిఎస్‌బి కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు జగిత్యాల నుండి
# పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలి

### నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న పర్యటన, అభివృద్ధి కార్యక్రమాలు, బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, నాయకులు,కార్యకర్తల తరలింపు తదితర అంశాలపై చర్చించారు.నియోజకవర్గంలోని ప్రతి మండలం, పట్టణం,గ్రామం నుంచి పార్టీ శ్రేణులు సమన్వయంతో పెద్ద సంఖ్యలో సిరిసిల్లకు తరలివెళ్లేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,మండలాల ముఖ్య నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పనులు
# వేగవంతం చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం మంథనిలో పుష్కర ఘాట్ల నిర్మాణ ప్రాంతం,గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో రైతులు,అధికారులతో భూసేకరణపై సమీక్షించారు.పుష్కరాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చూడాలని సూచించారు. ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖలుసమన్వయంతో పనిచేయాలన్నారు.ఘాట్ల వద్ద భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్ వసతులు ముందస్తుగా ప్రణాళిక చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.అలాగే మల్లెపల్లి బాలుర డిగ్రీ కళాశాలను పాఠశాల ఆవరణలోకి మార్చిన నేపథ్యంలో విద్యార్థులకు తరగతి గదులు,తాగునీరు,ఫర్నిచర్ తదితర వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.పర్యటనలో ఆర్డీఓ సురేష్,మున్సిపల్ కమిషనర్ మనోహర్,తహసీల్దార్ ఆరిఫోద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం!

### వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం

### విప్ ఆది శీనన్న సహకారంతో మరింత ముందుకు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

**మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి..**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

**60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం..**

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా పనిచేశారు,సుమారు 60 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి సంబంధించిన పలు అంశాలపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయవాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికల కమిషన్ తీరుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఎన్నికల కమిషన్ వ్యవహార శైలికి నిరసనగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు.సి ఈ సి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ, మోడీ,అమిత్ షా కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని ఆరోపించారు.సర్ పేరుతో 13 కోట్ల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, అధికారం కోసం బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ ఎన్నోసార్లు హెచ్చరించినా కమిషన్ తీరు మారలేదని, CEC వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు,కౌన్సిలర్లు, సర్పంచులు,మండల,పట్టణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పుస్తక పఠనంతోనే మేధోశక్తి పెంపొందుతుంది

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** మారుతున్న ఆధునిక కాలంలో పుస్తక పఠనం మానసిక వికాసానికి, మేధో శక్తి పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని జగిత్యాల టౌన్ సిఐ కరుణా కర్ పేర్కొన్నారు.పుస్తకాలు చదివే అలవాటును ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ప్రోత్సహించేందుకు గాను నవచేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సంచార పుస్తకాలయ బస్సును సోమవారం సిఐ ప్రారంభించారు.అనంతరం సిఐ మాట్లాడుతూ ఈ సంచార గ్రంథాలయంలో విజ్ఞాన దాయకమైన, సాహిత్యం, నవలలు, విద్యార్థులకు ఉపయోగపడే అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.నేటి డిజిటల్ యుగంలో ఫోన్లకు పరిమితమవుతున్న సమాజంలో పుస్తక పఠనం ప్రాధాన్యతను పునరుద్ధరించడమే ఈ సంచార గ్రంథాలయం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పుస్తకాలు చదివే ఆసక్తి ఉన్నవారందరూ, ముఖ్యంగా విద్యార్థులు, యువత తప్పనిసరిగా ఒక్కసారైనా ఈ నవచేతన సంచార పుస్తకాలయాన్ని దర్శించి,తమకు కావాల్సిన పుస్తకాలను సందర్శించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంచార పుస్తకాలయ సిబ్బంది రమేష్,తదితరులు ఉన్నారు.



## ఖతార్ దేశంలో నడికుడ వాసి మృతి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** జీవనోపాధికి గల్ఫ్ దేశమైన ఖతార్ దేశం వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్ గురై నడికూడా గ్రామానికి చెందిన తలారి ముత్తన్న 50 సంవత్సరాల వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. గత 13 సంవత్సరాలుగా పొట్టకూటి కోసం గల్ఫ్ దేశం వెళ్లి జీవనం సాగిస్తున్న ముత్తన్న గత ఐదు నెలల క్రితం విరామ నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి వెళ్ళాడని ఇంతలోనే,26 తేదీన బ్రెయిన్ స్ట్రోక్ గురై మృతి చెందిన విషయం తెలియడంతో కుటుంబీకులు రోధిస్తుండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం తగిన సహాయమందించి మృదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా సహాయ సహకారాలు అందించాలని కుటుంబీకులు గ్రామస్తులు వేడుకుంటున్నారు.కాగా మృతునికి భార్య ఇద్దరు కూతురు కుమారుడు ఉన్నారు.

## రైతులకు ఎస్సారెస్పి నీటిని అందించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్:** కరెంటు కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నష్టపోయిన పంటలకు బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరిన పట్టించుకోకుండా వివక్ష చూపుతుందని,మొక్కజొన్న వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తక్ పట్టి ఇచ్చి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, లేనియెడల రైస్ మిల్లర్లు నిర్వాహకుల మధ్య రైతులు దోపిడీకి గురవుతున్నారని ఎలాంటి ఆశ్చర్ లేకుండా ఓటీపీ ద్వారా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు ఉన్నారు.

## ఎఐకెఎంఎస్ బహిరంగ సభకు తరలింపు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఖమ్మంలో ఈనెల 28 నుంచి 30వ తేది వరకు జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఎఐకెఎంఎస్) జాతీయ 4వ మహా సభల్లో పాల్గొనేందుకు పెద్దపల్లి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఎఐకెఎంఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి రైతు కూలీలు ఖమ్మంకు తరలివెళ్లారు.




## నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ పలువురు గ్రామస్థులు విచారణకు డిమాండ్ చేశారు. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుకు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.గ్రామ పంచాయతీకి వివిధ రూపాల్లో వచ్చిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించకుండా దారిమళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే సంబంధిత సర్పంచ్ తాడిశెట్టి చామంతి, ఉప సర్పంచ్ కొడపత్రి వినోద్, పంచాయితీ కార్యదర్శితో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిధులు రికవరీ చేయాలి.ఫిర్యాదుపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని కుమ్మరి తిరుమల్,మోలుమూరి వంశీ,కుమ్మరి సదయ్య,కుమ్మరి నిరంజన్, కుమ్మరి సది,శ్రవణ్ తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు,వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని,సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## క్రీడాకారులకు ఓఎన్జీసి స్కాలర్‌షిప్

**ప్రజాపక్షం/మల్యాల :** ఆర్థిక ఇబ్బందులతో క్రీడల్లో కొనసాగలేకపోతున్న ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఓఎన్జీసీ స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తోంది. 2026–27 విద్యా సంవత్సరానికి అర్హులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది.అర్హతలు: భారతీయ క్రీడాకారులు 2026 ఏప్రిల్ 1 నాటికి 15 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. జిమ్నాస్టిక్స్ వంటి విభాగాలకు కనీస వయస్సు 10 ఏళ్లు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదు. ఇతర సంస్థల నుంచి స్కాలర్‌షిప్, స్టైపెండ్ పొందుతున్న వారు అర్హులు కారు.

**19 క్రీడంశాల జాబితా :** కబడ్డీ, క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టెన్నిస్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, ఆర్చరీ, బాక్సింగ్, షూటింగ్, రెజ్లింగ్, గోల్ఫ్, చెస్, స్క్వాష్, పారా స్పోర్ట్స్‌లో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 1 2025 నుంచి ఇప్పటివరకు పేర్కొన్న క్రీడంశాల్లో పాల్గొని ఉండాలి.

**ప్రయోజనాలు:** దేశవ్యాప్తంగా 250 మందిని ఎంపిక చేయనుండగా,50 శాతం సీట్లను మహిళలకు కేటాయించారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు స్కాలర్‌షిప్ అందుతుంది. ఉన్నత విభాగాలు, పోడియం ఆస్పిరెంట్ కేటగిరీలో రూ.70 వేల వరకు చెల్లిస్తారు. రూ.5 లక్షల ఆరోగ్య, ప్రమాద బీమాతోపాటు క్రీడా సామగ్రిని అందిస్తారు.దరఖాస్తు వివరాలు చివరి తేదీ: 29 సెప్టెంబరు 2026 దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్: ONGC Sports Scholarship Portal (https://sportsscholarship.ongc.co.in/అర్హులైన క్రీడాకారులు సెప్టెంబరు 29వ తేదీలోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి. పథకానికి సంబంధించిన అదనపు నిబంధనలు, ఎంపిక వివరాలను ఓఎన్జీసీ అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం నగరం కేసిఆర్ కాలనీ కు చెందిన యం.డి.అహ్మోదొద్దిన్ తాను వికలాంగుడినని, బి.కాం పూర్తి చేశానని,తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్,సంబంధిత జిల్లా అధికారులు,పాల్గొన్నారు.

## క్లోరిన్ డయాక్సైడ్ ప్లాంటు ప్రారంభం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఎన్‌టిపిసి రామగుండం స్టేజ్1 క్లోరినేషన్ సిస్టం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన క్లోరిన్ డయాక్సైడ్ ప్లాంటును సోమవారం ఎన్‌టిపిసి ఈ.డి.(ఆర్అండ్ టి) చందన్ కుమార్ సమంత, జీఎం (ఓఅండ్ఎం) మనీష్ ఆగర్వాల్ లు ప్రారంభించారు. ఈ ప్లాంటు ప్రారంభం స్టేషన్‌లో భద్రత, పర్యావరణ నిబంధనలు, కార్యచరణ విశ్వసనీయతను బోలపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసినట్లు తెలిపారు. దీనివల్ల క్లోరినేషన్, వాటర్ ట్రీట్‌మెంటు సిస్టం సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంలు జీఎన్.కుల్హాడే, ఎ.కె.బెహ్రా, బిజోయ్ జోస్, విజయ్‌కుమార్, కనౌజియాలతోపాటు ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ విద్యుత్తు ప్లాంట్లకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన డిఐఇఒ

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కల్పన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం, అధ్యాపకుల విద్యా బోధన తీరు,అకడమిక్ ప్రగతి,కళాశాల నిర్వహణతో పాటు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఆమె నిశితంగా పరిశీలించారు. అనంతరం వివిధ తరగతి గదులకు వెళ్లిన విద్యాధికారి, విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. సబ్జెక్టులపై వారకున్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ కళాశాలలో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతి,కళాశాల అవసరాలను డిఐఈఓకు వివరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## సంఘ స్థలంలో నిర్మాణం నిలిపివేయాలి

**ప్రజాపక్షం/కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని మేరు సంఘానికి సంబంధించిన స్థలంలో జరుగుతున్న భవన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ సంఘ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి లో వినతిపత్రం సమర్పించారు.సంఘ సభ్యుల వివరాల ప్రకారం.. మేరు సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ 3760/95, తేదీ 30 101995న నమోదైందని తెలిపారు. సంఘానికి సంబంధించిన స్థలంలో ఇంటి నంబర్ 5112లో 40 గజాల స్థలాన్ని మేరు సంఘ సభ్యుల అనుమతి, తీర్మానం లేకుండానే 1995లో విక్రయించినట్లు వారు ఆరోపించారు. ఈ విషయాన్ని అప్పట్లో సంఘ సభ్యులకు తెలియజేయలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు.సంఘ స్థలానికి సంబంధించి సమస్యను గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సభ్యులు తెలిపారు. 04072022న అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం సదరు స్థలంలో గట్ల నరేష్ తండ్రి : లక్ష్మ ణ్,భవన నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు.ఈ విషయంపై 07/09/2026న కోరుట్ల మున్సిపల్ కమిషనర్, కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. అయితే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, సంబంధిత అధికారులు నిర్మాణాన్ని నిలిపివేయలేదని వారు పేర్కొన్నారు.అధికారికంగా విచారణ జరిపి సంఘ స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అర్. సత్తయ్య,గట్ల శ్రీనివాస్,గట్ల గణేష్,రామగిరి గణేష్, పెద్ది రమేష్,గట్ల నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ కాంగ్రెస్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్ నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్ చేతుల మీదుగా అబ్దుల్ రజాక్ నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, ముస్లిం మైనార్టీ వర్గాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న అబ్దుల్ రజాక్‌ను వేములవాడ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల



మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మాజీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు తన నియామకానికి సహకరించిన మైనార్టీ నాయకులు, పార్టీ శ్రేణులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ నాయకులు మహమ్మద్ షాహిద్ పాషా, మొహమ్మద్ సోహెల్ ఖాన్, మహమ్మద్ షఫి ఉద్దీన్, సయ్యద్ షబ్బీర్, ఎదురుగట్ల తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ జూనియర్ అసిస్టెంట్ మృతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ జూనియర్ అసిస్టెంట్ బోయిన్పల్లి అశోక్ (44) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ ఐ జి నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఆదివారం సాయంత్రం బండలింగాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొనడంతో అశోక్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. నిజామాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మృతుడి సోదరు డటి బోయిన్పల్లి శ్యామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఎన్నికల కమిషన్ తీరుపై కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఎన్నికల కమిషన్ తీరుకు నిరసనగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మోడీ, అమిత్‌షా కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ 'సర్' కార్యక్రమం పేరిట 13 కోట్ల ఓట్ల తొలగింపు కుట్ర చేపడుతుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు మహమ్మద్ ముస్తాఫా ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటి మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంతల రాజేష్, దీటి బాలరాజు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రామగుండంలో దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/రామగుండం :** 'సర్' పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడాన్ని నిరసిస్తూ రామగుండం పట్టణంలో సీఈసీ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ రామగుండం పట్టణ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీనవర్గాల ఓట్లను కుట్రపూరితంగా తొలగించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఓటు చోరీని బహిర్గతం చేయడానికి ప్రజలు కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇస్సంపల్లి అంజుల్, సిరిసెట్టి సతీష్‌కుమార్, దారంగుల కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## లిల్లీ పూల సాగుతో లక్ష రూపాయల ఆదాయం

### ఎల్ నినో పరిస్థితుల్లోనూ ఆదర్శంగా నిలిచిన గొల్లపల్లి రైతు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :**జిల్లా ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో సాంప్రదాయ పంటలకు భిన్నంగా పూల సాగు చేపట్టి ఒక రైతు మంచి లాభాలను ఆర్జిస్తున్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన రైతు నరసాని హన్మాంతరెడ్డి తన కున్న భూమిలో వినూత్నంగా లిల్లీ పూల సాగును చేపట్టారు.ఈ సందర్భంగా సోమవారం లిల్లీ పూల సాగు తోటను ఉద్యాన శాఖ అధికారిణి అర్చన సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అమూల్యమైన సలహాలు, సూచనల మేరకు హన్మాంతరెడ్డి తన 20 గుంటల (0.20 ఎకరాలు) భూమిలో లిల్లీ పూల తోటను సాగు చేశారు.తక్కువ నీటితో, ప్రత్యా



మ్నాయ పద్ధతుల్లో పంటను ఎలా కాపాడుకోవాలో జిల్లా ఉద్యాన శాఖ తరపున అందించిన సాంకేతిక పరిజ్ఞానం రైతుకు ఎంతగానో దోహదపడిందని అన్నారు.ఈ లిల్లీ పూల సాగుకు రైతును ఆర్థికంగా ఆదుకునేందుకు,ప్రభుత్వం తరపున ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీని కూడా అందజేసి ఎంతగానో ప్రోత్సాహించారని అన్నారు . వాణిజ్య పంటల వైపు అడుగులు వేయాలని రైతులను ఉద్యాన శాఖ అధికారిని అర్చన ఈ సందర్భంగా కోరారు.

## రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం

### మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** రైతుల సంక్షేమం మరియు ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేయాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నూతనంగా ఏర్పడిన పిఎసిఎస్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుల్కం రాజు మాట్లాడుతూ.. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతాంగానికి కొండంత అండగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో సహకార సంఘాలు బలోపేతమవుతున్నాయని తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు,



ఎరువులు అందిస్తూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. సంఘం పరిధిలోని 22 గ్రామాల రైతులకు ఏ సమస్య వచ్చినా పాలకవర్గ సభ్యులు ముందుండి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొండ రాజశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్, పిఎసిఎస్ కార్యదర్శి, అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరసింహ ఆలయ పునరుద్ధరణకు శృంగేరి పీఠాధిపతి అనుమతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలోని శ్రీ ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ,జీర్ణోద్ధరణ పనులకు శృంగేరి పీఠాధిపతి జగద్గురువులు అనుమతి ఇచ్చారు. శాస్త్ర, సాంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,ఆలయ ఈఓ శ్రీనివాస్,ధర్మపురి అగ్రహారం పెద్దలతో కలిసి సోమవారం శృంగేరి పీఠాధిపతి జగద్గురువులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు, పత్రాలను జగద్గురువులకు అందజేసి నిర్మాణ పనుల వివరాలను వివరించారు.ఆలయ పునరుద్ధరణ పనులు శాస్త్ర, సాంప్రదాయాలకు అనుగుణంగానే ఉన్నాయని, పనులను ప్రారంభించి వచ్చే గోదావరి పుష్కరాల లోపు పూర్తి చేయాలని జగద్గురువులు సూచించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం ఇటీవల రూ.10 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఇటీవల భూమిపూజ నిర్వహించారు. శృంగేరి పీఠాధిపతి అనుమతితో ఆలయ పునరుద్ధరణ పనులు త్వరలో ఊపందుకోనున్నాయి. పుష్కరాల అనంతరం యోగా నరసింహ ఆలయ పునరుద్ధరణ : ధర్మపురిలోని శ్రీ యోగా నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా చేపట్టాలని జగద్గురువులు సూచించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల అనంతరం యోగా నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన అనంతరం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి జగద్గురువులను ఆహ్వానించారు. ఇందుకు జగద్గురువులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా జగద్గురువులు మంత్రికి తీర్థ ప్రసాదాలతో పాటు శేష వస్త్రాలను అందజేశారు.శృంగేరి పీఠాధిపతి అనుమతితో ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు మార్గం సుగమమైంది.

## పారుపల్లి గ్రామస్థుల దశాబ్దాల కల సాకారం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మారుమూల ప్రాంతమైన పారుపల్లి గ్రామానికి ఎట్టకేలకు రవాణా సౌకర్యం లభించింది.సర్పంచ్ చొప్పరి సంపత్ నిరంతర కృషితో టీజీఆర్టీసీ బస్సు గ్రామానికి చేరుకోవడంతో ప్రజల దశాబ్దాల కల నెరవేరింది.గ్రామస్థులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ సంపత్, గోదావరిఖని డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసి,బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన డీఎం, జమ్మికుంట నుండి గోదావరిఖని వెళ్లే బస్సును నేరుగా పారుపల్లి గ్రామంలోపలికి నడిపించారు. తొలిసారి గ్రామంలోకి ప్రవేశించిన బస్సుకు గ్రామస్థులు,మహిళలు ఘనస్వాగతం పలికారు.త్వరలోనే పెద్దపల్లి బస్సు కూడా గ్రామం మీదుగా నడుస్తుందని సర్పంచ్ తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలందరూ ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.తమ సమస్యను తీర్చిన సర్పంచ్‌కు,గోదావరిఖని డీఎంకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ అంబటి చంద్రమౌళి,యూత్ అధ్యక్షుడు కారుపకాల శ్రీకాంత్,రాజశేఖర్, బైరాం రాజు,తిరుమలరావు,పీక శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య మహాజన సభ...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**ఎల్లారెడ్డిపేట సహకార సంఘం అభివృద్ధి శక్తివంచన లేకుండా కృషి చేశానని 14 సంవత్సరాలుగా అవకాశం కల్పించిన రైతులకు పాలకవర్గ సభ్యులకు ఋణపడి ఉంటానని సింగిల్‌విండో చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి తెలిపారు.సోమవారం ఆయన అధ్యక్షతన సంఘం భవనం సర్వసభ్యసమావేశం నిర్వహించి మాట్లాడారు.వార్షిక ఆదాయ,వ్యయ నివేదిక సమర్పించారు.టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ సహకారంతో 30కోట్ల టర్నోవర్ సాధించామని అన్నారు.రైతులు ఆయిల్‌ఫామ్ సాగుచేయాలని కోరారు.విత్తనాలు ఆవ్ పద్ధతితో కాకుండా మాన్యువల్ పద్ధతి కొనసాగించాలని అందుకు ప్రతి ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో జంగిటి సత్తయ్య,గొట్టెసరిత,దొమ్మాట నర్సయ్య,ల్యాగల సతీష్,వెంకటనర్సింహారెడ్డి,రైతులు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శంకర్రావుపేట గ్రామంలో సోమవారం ఉదయం ఒక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శంకర్రావుపేట గ్రామానికి చెందిన గాజుల లత (48) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుంది.మృతురాలు గత కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ గడ్డల సమస్యతో తీవ్రంగా బాధపడుతోంది. ఈ క్రమంలో వ్యాధి బాధలు భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో తన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.ఈ ఘటనపై మృతురాలి తమ్ముడు గోలి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థులు ఆకలి తీరుస్తున్నాం

### ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు ఆకలితో అలమటించవద్దని, ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హరే రామ హరే కృష్ణా ట్రస్టు భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూపేద విద్యార్థులు ఆకలితో అలమటించద్దు అనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరే రామ హరే కృష్ణా ట్రస్టు భాగస్వామ్యంతో ఉదయం పూట అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచకుండా మోసం చేశారని కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు అండగా నిలిచామని గుర్తు చేశారు.

# ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం / హుజీపూర్ :** మండలంలోని పెద్దంపేట్ గ్రామంలో సోమవారం ముదిరాజ్ సంఘం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా సంగనవేణి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బర్ల వెంకటేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంగనవేణి సత్తయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ సమాజ సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం పాటుపడుతుందని పేర్కొన్నారు. ఈ కమిటీలో ఉపాధ్యక్షుడిగా నేరేళ్ల మహేష్, సహాయ కార్యదర్శిగా సంఘనవేణి అశోక్, కోశాధికారిగా బుచయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా పోషమల్లు, కార్యవర్గ సభ్యులుగా పోషన్న, నాగరాజుతో పాటు పలువురు ఎన్నికయ్యారు.

# ప్రజావాణికి అధికారులు గైర్హాజరు

**ప్రజాపక్షం / కోటపల్లి :** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సరిగా హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మధ్యాహ్నం 12 గంటలు దాటినా పది మంది అధికారులు కూడా రాకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు స్వయం గా హాజరుకాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. సమస్యలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే స్థాయి అధికారులు లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అర్జీదారులు అయోమయానికి గురవుతున్నారు. అధికారుల తీరుతో ప్రజావాణి లక్ష్యమే నీరుగారుతోందని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యతారాహిత్యం గా వ్యవహరిస్తున్న అధికారులపై తగిన చర్య లు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జైనూర్ సిహెచ్‌సిలో 24 గంటల్లో ఆరు ప్రసవాలు



**ప్రజాపక్షం / జైనూర్ :** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్‌సి)లో 24 గంటల వ్యవధిలో ఆరు ప్రసవాలను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ తెలిపారు. జైనూర్ సిహెచ్‌సిలో 24 గంటల్లో జరిగిన ఆరు ప్రసవాల్లోనూ తల్లులు, శిశువులు అందరూ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తల్లీ బిడ్డల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సరైన సంరక్షణ అందించామన్నారు. గర్భిణులు చివరి నిమిషం వరకు ఆగకుండా ముందుగానే సమీపంలోని ప్రభుత్వ దవాఖానలను సంప్రదించి సురక్షిత ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రసవాల ప్రక్రియలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో సేవలందించారు.

# భగత్‌సింగ్ ఆశయాల సాధనకు యువత పోరాడాలి



**ప్రజాపక్షం / వాంకిడి :** షహీద్ భగత్‌సింగ్ ఆశయాలకు అనుగుణంగా యువత కులమతాలకు అతీతంగా సమాజ అభివృద్ధి కోసం పోరాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) మండల కార్యదర్శి దుర్గం నిఖిల్ పిలుపునిచ్చారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గం నిఖిల్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి విముక్తితో పాటు కుల, మత, లింగ వివక్షలు లేని సమానత్వ సమాజ స్థాపనే భగత్‌సింగ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆయన రాసిన గ్రంథాలు, సిద్ధాంతాలను యువత అధ్యయనం చేసి శాస్త్రీయ దృక్పథాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు మహిళా సాధికారత, దేశాభివృద్ధి కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ఉదయ్, సహాయ కార్యదర్శి రాజేశ్వరి, నాయకులు సన్నీ, వైష్ణవి, శృతి, కార్తీక్, సంతోష్ లుకెయ్, యువరాజ్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండలంలోని ఎలకపల్లి ప్రధాన రహదారి వద్ద గ్రామస్తులకు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంక్ ఖాతా సమాచారం, ఏటిఎం కార్డు వివరాలు, ఓటిపిలు ఎవరికీ చెప్పవద్దని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. బ్యాంకర్లు లేదా పోలీసు అధికారుల పేరుతో వచ్చే అనుమానాస్పద కాల్స్ నమ్మి వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మహేష్, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం / కెరమెరి :** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం అక్టోబర్ 7న నిర్వహించే జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజెఐజెయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్. సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమ బాట పడతామని స్పష్టం చేశారు. అక్టోబర్ 7న జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లోని ఏ రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు జిల్లాలోని పాత్రికేయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, టియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు కె. చంద్రకాంత్, నాయకుడు రాధాకృష్ణ చారి, పాత్రికేయులు ఏజాస్ అహ్మద్, బాలాజీ, వెంకటస్వామి, రమేష్ రాథోడ్, గిట్టే కిరణ్ పాల్గొన్నారు.

# రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది పలికిన యశోద

## రేడియేషన్ అంకాలజిస్టు వైద్యుడు పెద్ది మణిదీప్




**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** కాన్సర్ రోగుల మెరుగైన చికిత్స కోసం ఎలెక్టా లైనిక్ అనే అత్యాధునిక టెక్నాలజీని హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి ప్రవేశపెట్టడం జరిగిందని, రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది పలికినామని యశోద రేడియేషన్ అంకాలజిస్టు వైద్యులు పెద్ది మణిదీప్ పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రేడియేషన్ చికిత్సలో నూతన ఒరవడి, మార్పులపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. యశోద హైటెక్ సిటి ఆసుపత్రిలో ప్రపంచంలోని అత్యాధునిక రేడియేషన్ యంత్రాలలో ఒకటి అని ఎంఆర్ఐ స్కానింగ్ , లీనియర్ యాక్సిలేటర్ ఒకే యంత్రంలో పని చేయడమే దీని ప్రత్యేకత అన్నారు. ప్రోస్టేట్ క్యాన్సర్, రెక్టల్ క్యాన్సర్, యుటరస్, సర్విక్స్, బ్లాడర్, లంగ్, ప్యాంక్రియాస్, బ్రెయిన్ ట్యూమర్ల వంటి కష్టమైన క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. దీని ద్వారా సమయం చాలా ఆదా అవుతుందని, కొన్ని సందర్భాలలో ఐదు రోజుల్లోనే పూర్తి చికిత్స పూర్తవుతుందని దీని ద్వారా రోగులకు మానసికంగా, శారీరకంగా పెద్ద ఉపశమనం ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో హైటెక్‌సిటి యశోద ఆసుపత్రి అకాంలజీ మేనేజర్ పత్తిపాక శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ పాలకుర్తి నవీన్ పాల్గొన్నారు.

# పోషకాహారమే పునాది

**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** మానవ ఆరోగ్యానికి పోషకాహారమే పునాది అని, పోషకాహారం, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ నగర్ 1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు మొదటి ఆరేళ్లు అత్యంత కీలకమని, ఈ వయస్సులో వారికి పౌష్టికాహారంతో పాటు మంచి అలవాట్లు నేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పుట్టిన ఆరు నెలల వరకు శిశువులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత అదనపు ఆహారం ప్రారంభించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. పిల్లల ఎత్తు, బరువులను అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి శారద, అంగన్‌వాడీ కార్యకర్త రేణుక, సహాయకురాలు సాలమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# కెజిబివిని తనిఖీ చేసిన ఎంఇఒ

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను మండల విద్యాధికారి పి. చంద్రశేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినుల విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠశాల బ్యాగులను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం డైనింగ్ హాల్, తాగునీటి వసతిని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రత్యేక అధికారి నాగసుధ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి 9 దరఖాస్తులు

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కోట ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అధికారులు 9 దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన అర్జీల్లో భూ సమస్యలకు సంబంధించి ఏడు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒకటి, అటవీ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ప్రజా సమస్యలపై పోరాడాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, ఏఐఎఫ్‌డివై రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసులేటి వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని రామా టాకీస్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం, రైతుల సమస్యల పరిష్కారానికి భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రమేష్, తోగరి రాహుల్, సంజయ్, సునీత్ పాల్గొన్నారు.

# పర్యాటక పోటీల్లో విద్యార్థి ప్రతిభ

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహించిన పోటీల్లో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎన్. జశ్వంత్ రాష్ట్ర స్థాయి బహుమతి సాధించి ప్రతిభ చాటారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న జశ్వంత్ కుమురం భీం జిల్లాలోని పర్యాటక ప్రదేశాల విశిష్టతను వివరిస్తూ రూపొందించిన లఘు చిత్రం రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి జశ్వంత్‌తో పాటు ఆయనను ప్రోత్సహించిన కళాశాల యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. దేవేందర్‌ను జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జెసింత్ జోయల్, కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్‌సి సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా పొట్ట మధుకర్

**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధిగా పొట్ట మధుకర్ నియమితులయ్యారు. జిల్లాలో పార్టీ విజయానికి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించింది. తన నియామకానికి సహకరించిన కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ పెడిమల్ల నర్సింగ్‌లకు పొట్ట మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతతో తనపై మరింత కర్తవ్యం పెరిగిందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, దళితుల అభ్యున్నతికి, అంబేద్కర్ ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేత



**ప్రజాపక్షం/బోథ్ :** బోట్ మండల కేంద్రంలో తన జన్మదిన సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేయడంతో పాటు అన్నదానం చేసి ఊదారత చాటుకున్నాడు ఓ యువకుడు. బోథ్‌కు చెందిన నమలికొండ సుజయ్ కుమార్ శర్మ సోమవారం తన పదిహేనవ పుట్టిన రోజు జరుపుకున్నాడు. ఈ సందర్భంగా బోథ్ గ్రామ పంచాయతీలో పని చేసే పదిహేను మందికి దుస్తులు అందించడంతో పాటు అన్నదానం నిర్వహించారు.సుజయ్ తిరుపతిలోని కంచికామకోటి ఆధ్వర్యంలోని వేద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో వేదం తో పాటు తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు.

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/భైంసా :** మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి ఉచిత మెడికల్ క్యాంపులో భైంసా జూనియర్ సివిల్ జడ్జి ఆర్కే వెంకటరమణ సుహాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసికంగా శారీరకంగా అనారోగ్యంగా ఉన్నటువంటి పిల్లలకు కావలసినటువంటి చికిత్స కొరకు వారికి కావలసినటువంటి వైద్యం డాక్టర్ మహిపాల్ ద్వారా అందించడం జరిగింది.ఈ సందర్భంగా కార్యక్రమంలో న్యాయవాది అంజద్ షేక్ వైష్ణవి పాలీ క్లినిక్ సిబ్బంది స్నేహ సొసైటీ అధ్యాపక బృందం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కోఆర్డినేటర్ గైని అరుణ్ పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారం అవసరం



**ప్రజాపక్షం / జన్నారం :** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి. వాణి అన్నారు. సోమవారం జన్నారం సెక్టార్ పరిధిలోని కామన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వస్థ పిల్లలు సంతోషకరమైన భవిష్యత్తు అనే ఇతివృత్తంతో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎత్తుకు అనుగుణంగా కేంద్రం వెలుపల ఏర్పాటు చేసిన అద్దాలు వారిలో స్వీయ అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంలో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కృప, ఎఎన్‌ఎం ప్రియాంక, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు కాంత, జమున, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు పూర్తి

### చైర్మన్‌గా గొజ్జ జనార్ధన్ ఎన్నిక



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం నిర్మల్‌లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. మొత్తం 15 మంది సభ్యులు పూర్తి కోరంతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు.చైర్మన్ పదవికి యాటకారి సాయన్న, గొజ్జ జనార్ధన్ పోటీ చేయగా, అత్యధిక మెజార్టీతో గొజ్జ జనార్దన్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంసీ లింగన్న వైస్ చైర్మన్‌గా, అల్లాడి రవి ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సామనపల్లి రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు.ఎన్నికల ప్రక్రియను సహాయ ఎన్నికల అధికారి శరత్ బాబు,సహాయకులు సాయందర్,సిబ్బందితో సమన్వయంతో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా,శాంతియుతంగా పూర్తయింది.ఎన్నికైన నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

# మోసపూరితంగా రెడ్‌క్రాస్ కార్యవర్గం ఎన్నిక

### ఐఆర్‌సిఎస్ సభ్యుడు రవీందర్ ఆరోపణ




**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) నూతన కార్యవర్గ ఎన్నికలు కుల, మత వివక్షతో మోసపూరితంగా జరిగాయని ఐఆర్‌సీఎస్ సభ్యుడు రవీందర్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు.గత పదేళ్లుగా ఐఆర్‌సీఎస్‌లో సేవలందించిన వారిని నమ్మించి,ముఖ్యమైన పదవులన్నింటినీ మోసపూరితంగా ఒకటి రెండు కులాల వారే దక్కించుకున్నారని విమర్శించారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న ముస్లింలు, దళితులు, ముదిరాజ్‌లకు చోటు కల్పించకపోవడం శోచనీయమన్నారు.ఎన్నికలకు వెళ్లకుండా మూడు గ్రూపులు పదవులను సమానంగా పంచుకుందామని నమ్మించి, మోసం చేశారని మండిపడ్డారు. ఈ అన్యాయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, మళ్లీ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ సభ్యులు యాటకారి సాయన్న ముదిరాజ్, బర్మ చిన్నయ్య, ఎండీ మన్సూర్,రాజన్న,తదితరులు పాల్గొన్నారు.

# ఆప్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేశ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయాలే నేటి యువతకు నిజమైన స్ఫూర్తి అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ పేర్కొన్నారు.భగత్ సింగ్ జయంతి సందర్భంగా నిర్మల్‌లో ఆప్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ, భగత్ సింగ్ కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక విప్లవ స్ఫూర్తి అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం కేవలం 23 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. సమాజంలో అన్యాయంపై పోరాడటం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే భగత్ సింగ్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. అంతకుముందు, నిర్మల్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇంచార్జ్ రాథోడ్ రమేష్‌ను సయ్యద్ హైదర్, జిల్లా జనరల్ సెక్రటరీ సి.హెచ్. వినోద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజా సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్ కుమార్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, వైస్ ప్రెసిడెంట్ బైండ్ల శ్రీనివాస్,నియోజకవర్గ ఇంచార్జ్ మెరుగు రాజన్న,టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్ తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తగూడకు ప్రత్యామ్నాయ రోడ్డు వేయాలి



**ప్రజాపక్షం / కెరమెరి :**సాకడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడ గ్రామానికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ నాగార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి వెళ్లే దారిలో వాగు అడ్డంకిగా మారిందని, వర్షాకాలంలో రాకపోకలు సాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం వాగు దాటే క్రమంలో దుర్వ శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందాడని తెలిపారు. పదిహేనేళ్ల క్రితం ఆయన తండ్రి కూడా ఇదే వాగు ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాగు దాటాలంటే భయపడాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పెందోర్ ఆనందరావు, తుంరం లచ్చు, ఆదివాసీ నాయకుడు సెడ్మకి తుకారాం, గ్రామస్తులు వినాయకరావు, పాండు, రమేష్, లచ్చు, సముద్రబాయి, రత్తుబాయి, సోము, గుణవంత్రావు పాల్గొన్నారు.

## దరఖాస్తులు స్వీకరణ




**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణిలో రెండు దరఖాస్తులను స్వీకరించామని తహసీల్దార్ కిరణ్మయి, ఎంపిడిఓ సతీష్ కుమార్ లు తెలిపారు. ఈ రెండు దరఖాస్తులలో ఒకటి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కు రాగా, మరోటి హౌసింగ్‌కు సంబంధించిన దరఖాస్తు వచ్చిందన్నారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందచేశామన్నారు. ఈ ప్రజావాణిలో ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై ‘మాట ముచ్చట’



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలోని మహిళా మోర్చా జిల్లా కో కన్వీనర్ తోకల సరస్వతి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లను పరిశీలించి అంగన్వాడి బాలులతో మాట ముచ్చట చేశారు.అనంతరం సరస్వతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని బాలలకు ఇస్తున్న పోషకాహారాలపై బాలలకు అడగడం జరిగిందని బాలలకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడి టీచర్లకు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం పాలు గుడ్లు, తదితర పౌష్టికాహారం అందిస్తుందని విద్యార్థులకు నిరంతరం అందిస్తున్నామని అంగన్వాడి టీచర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్యామల,అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ చౌక్ ఏర్పాటు



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భగత్ సింగ్ చౌక్ లో స్వాతంత్ర్య సమర యోధుడు షహీద్ భగత్ సింగ్ చిత్రపటాన్ని మున్సిపల్ చైర్మన్ అంక మౌనిక మహేందర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ త్యాగం వెలకట్టలేనిదని,యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు.భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.యువతలో దేశభక్తిని పెంపొందించేందుకే పట్టణంలో భగత్ సింగ్ చౌక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని,చౌక్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధుజ ప్రకాష్, గుమ్మల ఆనంద్,బొప్పారపు సత్యవతి,బిజెపి మండల అధ్యక్షుడు ఉపేందర్,జిల్లా నాయకులు రవీందర్,ఎనుగందుల నారాయణ,బీసీ రాజన్న,స్థానిక నాయకులు,యువజన సంఘాల ప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు, యువకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భగత్ సింగ్ కు నివాళులర్పించారు.

## గోదావరి బ్రిడ్జి నుంచి దూకుతానని యువకుడు హల్‌చల్



**ప్రజా పక్షం/భైంసా :** బాసర గోదావరి నది బ్రిడ్జి పైన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన నవీన్ యువకుడు హల్ చల్ చేశాడు.అక్కడే విధులు నిర్వహిస్తున్న వాగ్దేవి లేబర్ కాంట్రాక్ట్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది గమనించి అతన్ని అదుపులోకి పోలీసులకు అప్పచెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తనకు బైక్ కొనివ్వాలని ఇంటిలో గొడవ పడి గోదావరి బ్రిడ్జి నుంచి దూకి చనిపోతానని అందరికి ఉరుకులు పరుగులు పెట్టించిన యువకుడిని బైకు కొనిస్తామని హామీ ఇవ్వడంతో అతని కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు. వాగ్దేవి లేబర్ కాంట్రాక్ట్ సిబ్బంది గణపతి,శ్రీనివాస్ బోటింగ్ సిబ్బంది గంగాధర్, నరేష్,సతీష్,పోలీస్ సిబ్బంది అందరు స్పందించి ఆ యువకునికి గోదావరి నది లో పడకుండా అతన్ని కాపాడినారు.

## బాధితుడికి బ్యాగు అందజేసిన కానిస్టేబుల్

**ప్రజాపక్షం / జన్నారం :** బస్టాండ్‌లో మరిచిపోయిన విలువైన సర్టిఫికెట్ల బ్యాగును వేగంగా గుర్తించి బాధితుడికి అందజేసి బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ చంద్రమౌళి నిజాయితీ చాటుకున్నారు. మందమర్రి పట్టణానికి చెందిన క్రీడా శిక్షకుడు అభిషేక్ నిర్మల్‌లో జరిగిన క్రీడా పోటీలకు హాజరై సోమవారం తిరిగి వస్తూ జన్నారం బస్టాండ్‌లో తన బ్యాగును మరిచిపోయి బస్సు ఎక్కారు. ఆ బ్యాగులో విద్యార్థులకు చెందిన క్రీడా ధ్రువపత్రాలు, అభిషేక్ వ్యక్తిగత సర్టిఫికెట్లు ఉన్నాయి. దండేపల్లి మండలం ముత్యంపేటకు చేరుకున్న తర్వాత బ్యాగు లేని విషయాన్ని గుర్తించిన బాధితుడు వెంటనే బ్లూకోల్ట్ కానిస్టేబుల్ చంద్రమౌళికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన కానిస్టే బుల్ బస్టాండ్‌కు చేరుకుని బ్యాగును భద్రపరిచి, అనంతరం అభిషేక్‌ను పిలిపించి సురక్షితంగా అప్పగించారు. సకాలంలో స్పందించి బ్యాగును అందజేసిన పోలీసు సిబ్బందిని స్థానికులు అభినందించా రు.

## మాదకద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ



ప్రజాపక్షం/బాల్కొండ : మండల కేంద్రం లోని జడ్పిహెచ్ఎస్‌లో నషాముక్త్ భారత్‌లో భాగంగా హెచ్ఎం బట్టు రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి విద్యార్థులకు మాదకద్రవ్యాలతో కలిగే శారీరక, మానసిక అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంతోష్, సుజాత, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌పై కేసు

ప్రజాపక్షం/భీమ్‌గల్: భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెజ్జొరా బైపాస్ రోడ్డులో ఇసుకతో అనుమానాస్పదంగా వస్తున్న ఒక ట్రాక్టర్ నెం.ఎపి15బిపి1423గా గుర్తించామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ రాకేష్‌ను గుర్తించి విచారించగా అనుమతి లేకుండా ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

## పట్టణ అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణ అభివృద్ధి కోసం మంత్రి లక్ష్మణ్ కుమార్ సహాయ సహకారాలతో మున్సిపల్ కౌన్సిల్ కృషి చేస్తున్నట్లు చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు.ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తదితర అంశాలపై సభ్యులు చర్చించి,సమావేశం అజెండాలోని ఆయా అంశాలకు ఆమోదం తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సోమవారము తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల భౌతిక నిల్వలు,ఈ పోస్ నిల్వలు, విక్రయ రికార్డులను పరిశీలించారు.ఎరువుల విక్రయాలను తప్పనిసరిగా ఈ పోస్‌లో నమోదు చేయాలని, బిల్లులు జారీ చేస్తూ స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు మండల వ్యవసాయ అధికారి సూచించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అరవింద్ అంటేనే హాఫ్ నాలెడ్జ్: మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ అంటేనే హాఫ్ నాలెడ్జ్ అని బిఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ లోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అహంకారం, అవినీతి, అబద్ధానికి అంగి లాగు తొడిగితే అది అరవింద్ అసలు రూపమన్నారు. అయ్యపేరు చెప్పుకుని 2004లో కాంగ్రెస్ బి ఫారంలు అమ్ముకున్న అవినీతి పరుడు అరవింద్ అని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని పగలు తిడతాడని, రాత్రి పోయి పొర్లు దండాలు పెడతాడు అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంకెంతకాలం విషం కక్కుతారని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలకు, రోత మాటలకు అరవింద్ అడ్డాగా మారిందని విమర్శించారు. అరవింద్ ఒక డ్రగ్స్ స్మగ్లర్ అని, రాకేష్ రెడ్డి ఒక ఎర్ర చందనం, దొంగ బంగారం స్మగ్లర్ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు, సత్య ప్రకాష్, లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు నదీమ్, పృథ్వీ, అజీమ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్, రంజిత్, అభిలాష్, మల్లారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ పూలాంగ్ చౌరస్తాలో హనుమాన్ నగర్‌లో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తండ్రి కొడుకులు తీవ్ర గాయాల పాలయ్యారు. నాలుగవ టాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పూలాంగ్ ప్రాంతంలోని హనుమాన్ నగర్‌లో ఓ ఇంట్లో విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంటి లోపల గదిలో షార్ట్ సర్క్యూట్ జరిగినా వస్తువులకు మంటలు అంటుకోవడంతో ఇంటి యజమాని మహమ్మద్ అబ్దుల్ ఖాన్ మంటలు ఆర్పేందుకు గదిలోకి వెళ్లారు. ఇది గమనించిన ఆయన కుమారుడు మహమ్మద్ అబ్దుల్ సాదుల్ తన తండ్రిని కాపాడాలన్న ఉద్దేశంతో గదిలోకి వెళ్లాడు. దీంతో భారీగా మంటలు చెలరేగడంతో మంటల్లో తండ్రి, కొడుకులు ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఇంట్లోనుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్, శంకర్ నేతృత్వంలో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని, గదిలోని మంటలను అదుపు చేశారు. అనంతరం మంటలకు గాయాల పాలైన తండ్రి, కొడుకులను ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసు, అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుక



ప్రజాపక్షం / మంచిర్యాల : దోపిడీ, అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి పోచన్న మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశించిన స్వాతంత్ర్యం కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదని, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయంతో కూడిన ప్రజాస్వామ్య వ్యవస్థను ఆయన కాంక్షించారని తెలిపారు. నాటి పోరాటాల ఫలితంగా వచ్చిన ప్రజాస్వామ్య హక్కులకు నేడు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ పేరుతో దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొగిలి లక్ష్మణ్, మాడిశెట్టి సత్యనారాయణ, ఎండి రబ్బాని, పొనగంటి ఏసేపు, మాడిశెట్టి కుమార్, రమేష్ పాల్గొన్నారు

## రూ.100 కోట్ల డిపాజిట్ల మైలురాయి అధిగమించిన ఎన్‌డిసిసిబి



ప్రజాపక్షం/నిజామాబాద్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్(ఎన్‌డిసిసిబి) ప్రధాన కార్యాలయం రూ.100 కోట్ల డిపాజిట్ల మైలురాయిని అధిగమించిన సందర్భంగా బ్యాంకు సిఇఒ నాగభూషణం వందే ప్రధాన కార్యాలయ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయంలో కేక్ కట్ చేసి ఈ విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. సిఇఒ నాగభూషణం వందే మాట్లాడుతూ ప్రధాన కార్యాలయ సిబ్బంది సమిష్టి కృషి ఖాతాదారుల నమ్మకం సహకారంతో ఈ మైలురాయిని సాధించామని తెలిపారు. 104 సంవత్సరాలకు పైగా ప్రజలకు విశ్వసనీయమైన సేవలందిస్తున్న ఎన్‌డిసిసి బ్యాంకుపై ఖాతాదారులు ఉంచుతున్న నమ్మకమే ఈ విజయానికి ప్రధాన బలమన్నారు ఇదే స్ఫూర్తితో బ్యాంకులోని అన్ని శాఖలుడిపాజిట్ల సమీకరణకు మరింత ప్రాధాన్యతనిస్తూ తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ విజయానికి సహకరించిన ప్రధాన కార్యాలయ సిబ్బంది, అధికారులు ఎన్‌డిసిసి బ్యాంకుపై నమ్మకంతో తమ డిపాజిట్లను ఉంచిన ఖాతాదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు సయ్యద్ రహమాన్ ఆధ్వర్యంలో భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ ధైర్యం, దేశభక్తి త్యాగం నేటి యువతకు, విద్యార్థులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం / జన్నారం : పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ జక్కు భూమేష్ తెలిపారు. జన్నారంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ఆధ్వర్యంలో, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు వైద్య బృందం కంటి పరీక్షలు చేపట్టింది. ఈ శిబిరంలో శుక్లాలు ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందికి పైగా రోగులను శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారిని కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. వీరికి ఉచితంగా భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడే నిరుపేదలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ కార్యదర్శి కస్తూరి సతీష్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బందారి మారుతి రాజు, కార్యదర్శి గోలి రాము, డిసి సభ్యులు అంజుతరావు, మల్యాల బాబు, నరేంద్రుల గోపి, పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, వార్డు సభ్యులు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేముల సౌజన్యంతో పాఠశాలలకు సామాగ్రి విరాళం



ప్రజాపక్షం/భీమ్‌గల్ : నియోజకవర్గంలోని ముచ్కూర్, ఏర్గట్ల, పచ్చలనడ్కుడ గ్రామాల హైస్కూళ్లకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సౌజన్యంతో తన వియ్యంకుడు పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి సహకారంతో సమకూరిన ఒక్కొక్కటి రూ.1.80 లక్షల విలువ గల సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను సోమవారం వేల్పూర్‌లోని నివాసంలో ఆయా పాఠశాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యనందించేందుకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ల్యాబ్ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని వేముల పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు రూ.1,46,650 విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వియ్యంకుడు దయానందరెడ్డి ముందుకు రావటం అభినందనీయమని, విద్యారంగానికి ఆయన అందిస్తున్న సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఉన్నతమైన విద్యను విద్యార్థులకు అందించటానికి ఇక ముందు కూడా అవసరమున్న చోట మా సహాయ సహకారాలుంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, నాయకులు, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఫైళ్లపై ఎమ్మెల్యే వేముల సంతకాలు



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మంజూరుకు సిద్ధంగా ఉన్న కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు సంబంధించిన మొత్తం 255 బ్యాచ్ ఫైళ్లపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సంతకాలు చేశారు. సోమవారం వేల్పూర్‌లోని తన నివాసంలో అన్ని మండలాల తహసీల్దార్ల సమక్షంలో ఈ ఫైళ్లపై సంతకాలు చేశారు. మండలాల వారిగా ఫైల్స్ వివరాలు కమ్మర్‌పల్లి 24, బాల్కొండ 28, ముప్కాల్ 22, మోర్తాడ్ 32, వేల్పూర్ 36, భీమ్‌గల్ 103, రుద్రంగి 10 ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పై ల్స్‌ను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిశీలించి సంతకాలు తీసుకుని ప్రభుత్వానికి పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వ మయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రభుత్వం అధికారంలోకి వ చ్చిన నాటి నుంచి ఇప్పటివరకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద లబ్ధి పొందిన వారందరికి అలాగే నూతనంగా మం జూరు కాబోయే లబ్ధిదారులందరికి లక్ష రూపాయల చెక్కుతో పా టు తులం బంగారం అందించాలని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేశారు.

## ఎంపి ఈటల ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం / ఇల్లందకుంట :** ఇటీవల మృతి చెందిన మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఎర్రబాటి సురేందర్ (49) కుటుంబానికి మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ఆర్థిక సహాయం చేశారు. గతంలో తన డ్రైవర్‌గా పని చేసిన సురేందర్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సమయభావం వల్ల సురేందర్ కుటుంబాన్ని నేరుగా కలవలేకపోవయామని విచారణ వ్యక్తం చేశారు. సురేందర్ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ వ్యక్తిగత సహాయకులు ఎదులాపురం నరేందర్, మాజీ సర్పంచ్ తిప్పరవేణి మొగిలి, రామస్వామి, గారంపల్లి మురళి, లక్ష్మయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులపై సమీక్ష

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో చేపడుతున్న వివిధ గ్రామీణాభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించేందుకు 29న మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరగనున్నట్లు ఆమె తెలిపారు.ఈ సమావేశానికి మల్యాల మండలంలోని సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులతో పాటు మండల స్థాయి శాఖాధికారులు పాల్గొనున్నట్లు ఆమె వివరించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు ఈ చర్చ వేదిక కానుందని ఆమె వెల్లడించారు.

## మాదకద్రవ్య రహిత యువత కావాలి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్‌ను దెబ్బతీయడంతో పాటుగా కుటుంబం సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కవి డాక్టర్ వాసరవేణి పర్శరాములు అన్నారు. సోమవారం ఆయన ఇంటర్మీడియట్ కళాశాలలో మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సేవ పథకం అద్వర్యంలో దేశప్రగతి లో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.విద్యా, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని అన్నారు. నషాముక్తి యువ భారత్ వికసిత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు.కాలేజి నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలి తీసి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో క్యాతం సత్యనారయణ, చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్టకవిత, నీరటి విష్ణుప్రసాద్, గజ్జెల గంగాధర్, సౌమ్య, గౌతమి, బోధనేతర సిబ్బంది తదితరులున్నారు.

# హరితహస్తం, జీవవైవిధ్య సెన్సరీ గార్డెన్ ఏర్పాటు



**ప్రజాపక్షం/ కొత్తపల్లిః** సామాజిక బాధ్యత, సేవాభావం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు దృష్టిలోపం ఉన్న విద్యార్థుల కొరకు ప్రభుత్వ పాఠశాలలో జీవవైవిధ్య సెన్సరీ గార్డెన్‌ను ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. ప్రశాంత్ తెలిపారు.ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ హెడ్, ఎకో క్లబ్ మెంటర్ శ్రీ లలిత్ మోహన్ సాహు మరియు అనిల్ మార్గదర్శకత్వంలో 8 వ తరగతి విద్యార్థులు ఆరుష్, ఆదిష్, రితీష్, శ్రీ వర్ధన్, సాయి సన్విత్ లు నిధులు సమీకరించి, దృష్టిలోపం ఉన్న విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలో జీవవైవిధ్య సెన్సరీ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మొక్కలను దృష్టిలోపం ఉన్న విద్యార్థుల పాఠశాలకు అందించారు. తులసి, లెమన్‌గ్రాస్, మల్లె, గులాబీ, పుదీనా, కరివేపాకు, వేప, తెల్ల కలువ తదితర ఔషధ, సుగంధ, సెన్సరీ మొక్కలను గార్డెన్‌లో నాటారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులు స్పర్శ, వాసన, శబ్దం వంటి ఇంద్రియాల ద్వారా ప్రకృతిని అనుభవించేలా ఈ సెన్సరీ గార్డెన్‌ను రూపొందించారు. మొక్కలుపక్షులు, సీతాకోకచిలుకలను ఆకర్షించేవిధంగా కూడాఎంపికచేశారు. కార్యక్రమంలో భాగంగా మొక్కల ఆకులను తాకి వాటి లక్షణాలను తెలుసుకునేలా టచ్ అండ్ ఫీల్ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, ప్రకృతి గీతాల ద్వారా మొక్కలు, పక్షులు, కీటకాలు పర్యావరణ సమతుల్యతలో పోషించే పాత్రను వివరించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులు మొక్కలను తాకి, వాటి సువాసనను ఆస్వాదిస్తూ ప్రకృతితో అనుబంధాన్ని పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద రావు మాట్లాడుతూ, “నిజమైన విద్య అంటే కేవలం పోటీల్లో విజయం సాధించడం మాత్రమే కాదు. కరుణ, మానవత్వం, సామాజిక బాధ్యతలను పెంపొందించడం కూడా. జీవవైవిధ్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే విషయాన్ని మా విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పారమిత పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, వినోదరావు, ప్రసాద్, హనుమంత్రరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, సమన్వయ కర్తలు శ్రీనాథ్, చంద్రసేనప్రాజెక్ట్ హెడ్, ఎకో క్లబ్ మెంటర్ లలిత్ మోహన్ సాహు, అనిల్ ఉపాధ్యాయులు అభినందించారు.

# హామీలు అమలు చేసేలా స్పష్టమైన ప్రకటన చేయాలి

## తోట ఆగయ్య, కొండూరి రవీందర్ రావు




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా సిరిసిల్ల సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావులు డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల ప్రజల గుండెల్లో కేటీఆర్ ఉన్నారని సిరిసిల్లను ఎలా అభివృద్ధి చేశారో సిరిసిల్ల ప్రజలకు తెలుసున్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. అసెంబ్లీలో 8 వేల ఎకరాల కబ్జా చేశారని 2400 ఎకరాలు రికవరీ చేశామని సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన విషయాలపై శ్వేతపత్రం విడుదల చేసి నిరూపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. మల్కాపేట రిజర్వాయర్ పూర్తి చేశామని మల్కాపేట రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా నీళ్లు తీసుకుపోయేలా చేశామన్నారు. రైతులకు మీరుఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, న్యాల కొండ రాఘవరెడ్డి, కుంభాల మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజు యాదవ్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి నోచుకోని తహసీల్దార్ కార్యాలయం




**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోకుండా అలాగే మూలనపడి ఉంది. భవన నిర్మాణ పనులు పూర్తిగా పూర్తయి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం దీనిని అందుబాటులోకి తీసుకురాకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే కొనసాగుతోంది.ప్రస్తుత వర్షాల నేపథ్యంలో పాత భవనం పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత విలువైన ప్రభుత్వ రికార్డులు, కంప్యూటర్లు, ఫైళ్లు తడిచిపోయే ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ స్పందించి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసినప్పటికీ, ప్రారంభించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అర్థం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.మరోవైపు కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం పాత భవనంలో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి,నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అంతర్గాంలో సిఇసి దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సింగం కిరణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సీఈసీ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను సోమవారం దగ్ధం చేశారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, డీసీసీ ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నరేంద్ర మోడీ, అమిత్‌షాకు తొత్తుగా మారి 13 కోట్ల ఓట్లు తొలగించే కుట్ర చేస్తోందన్నారు. జ్ఞానేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల కొలిపాక చంద్రారెడ్డి, గుంట బాపు, దారవేణి సాయి, మాజీ వైస్ ఎంపీపీలు కొదురుపాక పవన్, ఆవుల గోపాల్‌యాదవ్, నాయకులు బొడ్డు లింగమూర్తి, బరుపటి శ్రీను, శ్యామ్, ప్రశాంత్, దారవేణి ప్రశాంత్, లగిశెట్టి రాకేష్, కొండ మహేష్, గుమ్ముల శ్రీకాంత్, మగ్గిడి రాకేష్, సంది అక్షయ్, ఒల్లెపు స్వామి, గొర్రె చందు, ఓదెలు, మాధవరావు, తమ్మనవేని కొమురయ్య, బాలసాని అంజయ్య, బోడకుంట సంతోష్, చింతల ప్రసన్న, కాంపెల్లి సంతోష్, గజ్జెల నాగరాజు, గంగాధర శ్రీనివాస్, బానాల స్వామి, దాసరి శ్రీనివాస్, ఎండి.గౌసబాబా, జూల లింగయ్య, పానగంటి శ్రావణ్, కొత్త శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా షాహీద్ పాషా




**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్ చేతుల మీదుగా షాహీద్ పాషా నియామక పత్రాన్ని అందుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు షాహీద్ పాషాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. జిల్లా మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు షాహీద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మధు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు తనకు సహకరించిన మైనారిటీ నాయకులకు పార్టీ నాయకులకు షాహీద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రజాక్, మహమ్మద్ సోహెల్ ఖాన్, మహమ్మద్ పసి ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్‌లలో సర్వసభ్య సమావేశాలు

**ప్రజాపక్షం/శంకరపట్నంః** మండల పరిధిలోని మెట్టుపల్లి, గద్దపాక, తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో సోమవారం సర్వసభ్య సమావేశాలు చైర్మెన్లు మహష్,బసవయ్య,సంపత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా సంఘాల సీఈవోలు మెట్టుపల్లి సదయ్య,గద్దపాక శ్రీనివాస్,తాడికల్ వీరస్వామిలు సంఘాల వార్షిక లావాదేవీలు చదివి వినిపించారు.అనంతరం చైర్మెన్లు మాట్లాడూ ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తు సంఘం అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు చేస్తామని చేప్పారు.సంఘాల ద్వారా అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని సకాలంలో రుణాలు చేలించాలని సిబ్బంది సూచించారు.ఈ సమావేశంలో రైతులు గ్రామాస్తులు తదితరులు పాల్గోన్నారు.

## నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం




**ప్రజాపక్షం/అంతర్గాం :** భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటలో భగత్ సింగ్ విగ్రహాం వద్ద గుమ్మడి వెంకన్న అధ్యక్షతన జయంతి సభ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర సెక్రటరియేట్ సభ్యులు నంది రామయ్య మాట్లాడుతూ, దేశం కోసం చిన్న వయస్సులో ప్రాణాలు త్యాగం చేసిన మహానీయుడు భగత్‌సింగ్ అని ఆయన పోరాట పటిమను కొనియాడారు. నేటి మోడీ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ధరలు పెంచుతూ, నిరుద్యోగాన్ని పరిష్కరించకుండా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. భగత్ సింగ్ ఆశయాలకు విరుద్ధంగా దేశంలో నియంత పరిపాలన కొనసాగుతుందని, దీనిపై వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపాక శ్రీనివాస్, గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, మార్త రామన్న, కోడిపుంజుల లక్ష్మి, గూడూరి వైకుంఠం పాల్గొన్నారు.